డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా ?

- కొత్తకోటలో విద్యార్థుల అవస్థలు
- ఎన్నికల హామీగానే సరిపెడుతున్న నాయకులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు



కొత్తకోట పట్టణ వ్యూ

కొత్తకోట రూరల్: మారుతున్న సమాజంలో ఉన్నత చదువులు ఎంత అవసరమో మనందరికీ తెలిసిందే. దేవరకద్ర నియోజవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, ముసాపేట మండలాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఉన్నత చదువుల కల ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తకోట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం తర్వాత మర్చిపోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఆరు మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న కొత్తకోట అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ విద్యారంగంలో మాత్రం వెనకబడిపోయింది. గతంలో దేవరకద్ర నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నియోజవర్గాన్ని పలు రంగాల్లో అభివృద్ధి చేసినా కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుతం నియోజవర్గానికి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన జి.మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీలో కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి ప్రస్తావించారు. 2025–26 విద్యా సంవత్సరంలోనైనా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుకు మధ్యలోనే స్వస్తి..

దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, ముసాపేట మండలాల్లో ప్రతి ఏటా 1,500 మందికి పైగా ఇంటర్ ఉత్తీర్ణులవుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటే వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల వెళ్లాల్సి వస్తుంది. ఆయా పట్టణాలకు వెళ్లడం పేద, మధ్య తరగతి విద్యార్థులు భారంగా మారి చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తుందని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఆర్థిక భారం



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాను.దీంతో ఆర్థికంగా భారంగా మారింది. ఖర్చులు భరించలేని చాలామంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు.

కె.పల్లవి, డిగ్రీ విద్యార్థిని, అప్పరాల

కూలి పనులు చేస్తూ..



పదో తరగతి వరకు ప్రభుత్వ స్కూల్‌లోనే చదివాను. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ నన్ను చదివిస్తున్నారు. డిగ్రీ ప్రైవేట్‌లో చదవాలంటే ఖర్చులు ఎక్కువగా అవుతాయి. కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంటే మాలాంటి వాళ్లకు ఉపయోగంగా ఉంటుంది.

– సాయిచందన, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో నేతలు హామీలు ఇచ్చిన అమలు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఉన్నత చదువులు విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– అజయ్‌కుమార్, ఏబీవీపీ, పూర్వ జిల్లా కన్వీనర్.

శాస్త్రోక్తంగా రాజగోపురం కలశ ప్రతిష్ఠ



కలశాలకు పూజలు చేస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని అన్నపూర్ణ అమరేశ్వర స్వామి(శివాలయం) ఆలయ రాజగోపుర కలశ ప్రతిష్ఠ ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇటీవల నూతనంగా నిర్మించిన రాజగోపురానికి పూజలు చేశారు. కలశ ప్రతిష్ఠ మహోత్సవానికి హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి హాజరయ్యారు. ఆలయ ట్రస్టీ బాలాదిత్య లక్ష్మారావు కలశాన్ని ఎత్తుకొని రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విద్యారణ్య భారతీస్వామి కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆయనను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు కాల్వగడ్డ ప్రభాకర్‌శెట్టి, గుంత బాలయ్య, ఇటుకల బాలరాజుయాదవ్ తోపాటు శివభక్తులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



తాడూరు మండలం సిర్సవాడలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి కల్యాణం తిలకించి తరించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌లో..

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో కాశంశెట్టి విజయలక్ష్మి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో పలువురు భక్తులు యజ్ఞ హోమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. చిలుక వివేకరెడ్డి దంపతులు బహూకరించిన ఇత్తడి తొడుగులను ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభానికి అలంకించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరినామ స్మరణతో పులకించి పోయారు. చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు రెండోరోజు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాందేవ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలలో భాగంగా ఉదయం అభిషేకం, నిత్యహోమం, పూర్ణాహుతి తదితరులు కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు శేఖర్‌శర్మ, గోపిశర్మ, నరహరిశర్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు సీపీఎం మండల సమావేశం

పాన్‌గల్: సీపీఎం మండల సమావేశం సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి బాల్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపై రౌండ్‌టేబుల్ సమావేశంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై అనుసరించాల్సిన ప్రణాళికలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



అమరచింత: పట్టణంలోని చండూల్ బీడీ ప్యాక్టరీ సమీపంలోని రాజాప్రతాప్‌నగర్‌లో ఉన్న విద్యుత్ స్తంభానికి బోరు మోటార్ స్టాటర్ అమర్చిన మున్సిపాలిటీ అధికారులు అతుకులమయంగా ఉన్న విద్యుత్ వైర్లను మార్చలేకపోతున్నారు. చిన్నారులు బంతితో ఆడుకునే సమయంలో అతుకులతో ఉన్న విద్యుత్ తీగలకు తాకే ప్రమాదం ఉన్నా వాటిని మాత్రం అక్కడి నుంచి తొలగించట్లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే విద్యుత్ తీగలను, స్టాటర్‌ను మార్చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ట్యాంక్‌కు మెట్లు నిర్మించరూ..



వనపర్తి రూరల్: మండలంలోని కాశీంనగర్ పంచాయతీ పరిధిలోని ఎర్రగట్టుతండాలో తాగునీటి ట్యాంక్‌కు కింది నుంచి కొంత దూరం మెట్లు ధ్వంసం కావడం వలన ట్యాంక్ పైకి ఎక్కడానికి రాకపోవడంతో శుభ్రతకు నోచుకోవడం లేదు. మిషన్ భగీరథ నీటిని ట్యాంక్‌లోకి నింపుతున్నారు. కానీ ఒక్కసారి కూడా కడగట్లేదని, దీంతో ట్యాంక్‌లో పాకర, చెత్త చేరుకుంటోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్యాంక్‌కు మెట్లు నిర్మించాలని కోరారు.

ఉమారామలింగేశ్వర కల్యాణం



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పుర వీధుల గుండా ఊరేగించారు. సోమవారం రాత్రి తేరు ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి ప్రారంభోత్సవం

అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన ఎంబీ బేతేలు చర్చి ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్రహం ముఖ్య అతిథిలుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో అతి పెద్ద చర్చి నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. నిర్మాణంలో భాగస్వాములైన అందరికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రెవ ఆర్ఎస్ లేమూయేలు, ఎంబీ సంఘం ముఖ్య ఇవాంజిస్టులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రయాణానికి పాట్లు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ చెరువు కట్టపై పెరిగిన కంప చెట్లతో వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. కట్టకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగాయి. దీనివల్ల కట్టపై వాహనాలు ఎదురు పడితే సులువుగా వెళ్లడానికి వీలు కావడం లేదు. కట్టపై భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులకు కంప చెట్లు కళ్లకు తగిలేలా ఉన్నాయి. ఇటీవల ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి ఓ ఆటో చెరువులోకి పల్టీ కొట్టింది. పొన్నకల్ వైపు నుంచి రాచాల, నందిపేట, జీనుగరాల, దోకూర్, దేవరకద్రకు ఇదే రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కంప చెట్ల మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

'కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలి'



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు కాకం బాలస్వామి

పాన్‌గల్: వరి కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ధాన్యం కాంటా చేసే క్రమంలో ఖాళీ సంచి పేరుతో 600 గ్రాములు అదనంగా తూకం చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా 1,250 గ్రాములు తూకం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. దీంతో పాటు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేసి మిల్లులకు తరలించిన తర్వాత మిల్లర్లు తాలు పేరుతో బస్తాకు కిలో చొప్పున తరుగు తీస్తూ.. రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటాను వేగవంతం చేయాలని కోరారు. రైతులు ఈ విధంగా నష్టపోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోపిడీని అరికట్టకపోతే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని ప్రైవేటు వ్యక్తులు కూల్చివేసి నెలలు గడుస్తున్నా నేటికీ పునరుద్ధరించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణం బోర్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటూ క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సహదేవుడు, హన్మంతు, శంకరయ్య, బొజ్జన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్‌తో ఉపయోగం ఏంటి మహాప్రభో..



అధికారులు అందించిన వీల్‌చైర్‌తో దివ్యాంగురాలు శాంతమ్మ

పాన్‌గల్: అధికారులు తనకు ఏమాత్రం అనువుగా లేని వీల్‌చైర్ అందించడంతో అది నిరుపయోగంగా మారిందని దివ్యాంగురాలు శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లరాళ్లపల్లితండాకు చెందిన శాంతమ్మ కొడుకు బతుకుదెరువు కోసం వలస వెళ్లడంతో దివ్యాంగురాలు అయిన ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో అధికారులు ఆమెకు వీల్‌చైర్ అందించారు. కానీ ఇంకొకరి సహాయం లేకపోతే వీల్‌చైర్ కదలట్లేదని శాంతమ్మ వాపోతున్నారు. దీంతో అది నిరుపయోగంగా మారింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతుల సాయంతో ముందుకు కదిలే విధంగా ఉండే వీల్‌చైర్‌ను అందిస్తే ఉపయోగం ఉంటుందని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

భానుడి భగభగలు: నిర్మానుష్యంగా రహదారులు



నిర్మానుష్యంగా మారిన మరికల్-ఆత్మకూర్ ప్రధాన రహదారి

అమరచింత: ఎండ కారణంగా రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఇండ్ల నుంచి బయటకి రావడానికి కూడా భయపడుతున్నారు. కానీ పెళ్లిలు, శుభకార్యక్రమాలు ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటికి వస్తున్న పరిస్థితులు దాపరించాయి. అమరచింత పట్టణంలోని మరికల్–ఆత్మకూర్ రహదారి ఆదివారం ఎండ తాకిడికి జనం లేక నిర్మానుష్యంగా మారింది. జనాలు రోడ్డ పైకి రాకపోవడంతో మధ్యాహ్నం వేళ వ్యాపారాలు కూడా జరగట్లేదని వ్యాపారులు వాపోతున్నారు.

తల్లి దీవెనలు పొందిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



తల్లి వరలక్ష్మికి పాదాభివందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



తల్లి లక్ష్మీదేవమ్మకు పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: తల్లిని మించిన దైవం లేదని అమ్మ ప్రేమ కొనలేనిది, విలువ కట్టలేనిదని చెప్పవచ్చు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ బడా నేతలు తమ తల్లులకు పాదాభివందనాలు చేసి దీవెనలు తీసుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి మాతృదినోత్సవం సందర్భంగా తల్లి లక్ష్మీదేవమ్మకు పాదాభివందనం చేసి దీవెనలు తీసుకున్నారు. అదే విధంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన తల్లి వరలక్ష్మికి పాదాభివందనాలు చేసి దీవెనలు పొందారు.

వర్షపు నీరు వెళ్లే దారేది..

గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న సీసీరోడ్డు కారణంగా వర్షపు నీరు బస్టాండ్ ఆవరణ నుంచి బయటకు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. కొత్తగా వేస్తున్న సీసీరోడ్డు పాత రోడ్డు కంటే ఎత్తులో వేస్తున్న కారణంగా వర్షపు నీరు బయటకు పోయేందుకు దారి లేకుండా పోయింది. బస్టాండ్ ఆవరణలో రోడ్డు పక్కనే ఉన్న పాత ఇళ్లు పూర్తిగా తగ్గులోకి వెళ్లాయి. రైతు వేదిక నుంచి మసీదు వరకు మాచర్ల దారిలో కొత్తగా సీసీ రోడ్డును వేస్తున్నారు. పాత రోడ్డుపై ఉన్న మట్టి తొలగించి వేయకుండా అలానే కొత్తగా రెండు కోటింగ్‌లతో సీసీరోడ్డు వేశారు.

ఘనంగా మాతృ దినోత్సవం

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తల్లి నీకు వందనం అంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తల్లులు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

మానవపాడు: అమరవాయి– కలుకుంట్ల రహదారిపై అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అమరవాయి మీదుగా కలుకుంట్ల వెళ్లే రహదారి మార్గమధ్యలో వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

బీటీ రోడ్డుపై గుంతలు

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి నుంచి చెన్నంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. చెరువుకట్టపై బీటీరోడ్డుకు చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో అప్పుడప్పుడు కొంత మట్టిని వేస్తున్నా ఉపయోగం లేకపోతోంది. గుంతల్లో ఉన్న మట్టి చిన్న వానకే కొట్టుకుపోతోంది. ఇటీవల కంకర వేసి దానిపై మట్టిని వేసినా మళ్లీ కంకర తేలి గుంతలు కనిపిస్తున్నాయి. కట్ట దాటిన తర్వాత రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు మలుపుల వద్ద ఉన్న గుంతలతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

వీర జవాన్‌కు నివాళి



పాన్‌గల్: దేశ సరిహద్దులో వీర మరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం రాత్రి మండలంలోని గోప్లాపూర్‌లో యువకులు, గ్రామస్తులు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

నల్లబెల్లం, సారా పట్టివేత



నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, సారా, పటికను ఆదివారం పట్టుకునట్లు ఎక్సైజ్ సీఐ కల్యాణ్ తెలిపారు. బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన గుబ్బ శివకుమార్ హైదరాబాద్ నుంచి ఓమ్ని వ్యాన్‌లో 432 కిలోల నల్లబెల్లం, 10 కేజీల పటిక, 5 లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తున్నాడు. మున్సిపాలిటీ పరిధిలో ఎండబెట్ల వద్ద స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలో పట్టుబడ్డాడు. వాహనాన్ని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గుబ్బ శివకుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం సిబ్బంది హనీఫ్, సాయికిరణ్, కౌశిక్, నితిన్, శంకర్ పాల్గొన్నారు.

కాల్వ ఆధునికీకరణ పనుల పరిశీలన



కొల్లాపూర్: పట్టణంలోని 16వ వార్డులో రూ.కోటి వ్యయంతో చేపట్టిన ప్రధాన మురుగుకాల్వ ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అన్నపూర్ణ లాడ్జి సమీపం నుంచి వరిదేల చెరువు కట్ట వరకు మురుగుకాల్వ పనులు ఆధునీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి కేఎల్ఐ అతిథి గృహం వరకు సీసీ రోడ్డు వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. పనులను 16వ వార్డు మాజీ కౌన్సిలర్ సిబ్బంది నర్సింహారావు పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆయన వెంట నాయకులు బోరెల్లి మహేష్, పసుల వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దోమలు బాబోయ్ దోమలు

- అస్తవ్యస్తంగా డ్రైయినేజీలు
- రోగాల బారిన పట్టణ ప్రజలు



శివాజీనగర్‌లో పందుల స్వైర విహారం



నేతాజీనగర్‌లో డ్రెయినేజీ ఇలా..



చెరువు సమీపంలో పేరుకుపోయిన చెత్త

ఆత్మకూర్: పట్టణంలో దోమలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పిందని, సమస్యలపై దృష్టి సారించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 10 వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు నివాసాల ముందు చేరుతోంది. దీని కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతుండడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు పందుల స్వైరవిహారంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. పలుమార్లు అధికారులు డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పినా.. నేటికీ కార్యచరణ చేపట్టకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డ్రెయినేజీలు నిర్మించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఆత్మకూర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దుర్వాసన భరించలేకున్నాం. దోమలతో కాలనీవాసులు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. పురపాలక మండలి అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఫాగింగ్ చేపట్టి, డ్రెయినేజీలను నిర్మించాలి.

– గాయత్రి, గృహిణి, శివాజీనగర్

సమస్య పరిష్కరిస్తాం



ఆత్మకూర్‌లో చాలా సమస్యలు పరిష్కరిస్తున్నాం. కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఒక్కొక్కటిగా చక్కబెడుతున్నాం. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే డ్రెయినేజీల నిర్మాణాలు చేపడుతాం. దోమలు వ్యాప్తి చెందకుండా ఇది వరకే ఫాగింగ్ చేశాం. సిబ్బంది నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

– శ్రీధర్, కమిషనర్, ఆత్మకూర్